క్లుప్తంగా

విజయవంతం చేయాలి

మహబూబాబాద్: ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం కార్యక్రమ నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గుంతలుపడిన రోడ్లకు మరమ్మతులు చేసేందుకు ప్రతి వార్డుకు రూ.50వేలు కేటాయించనున్నట్లు, వెంటనే పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ నోముల రవీందర్, డీఈ సీహెచ్ ఉపేందర్, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందించిన సేవలతో మంచి గుర్తింపు వస్తుందని జిల్లా అటవీ శాఖ అధికారి విశాల్ బత్తుల అన్నారు. బదిలీపై వెళ్లిన అటవీ శాఖ డివిజనల్ అధికారి పోలోజు కృష్ణమాచారి ఆత్మీయ వీడ్కోలు సమావేశం గురువారం రాత్రి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.

పెరుగుతున్న జ్వరపీడితులు

గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రికి శుక్రవారం వైద్యం కోసం వచ్చిన జ్వర పీడితులు ఒక్కసారిగా డాక్టర్ రూంలోకి దూసుకొచ్చి డాక్టర్‌పై పడిపోయారు. దీంతో డాక్టర్ హనుమంతరావు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యాడు. మండలంలో విషజ్వరాలు విజృంభించడంతో గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రికి ప్రతీరోజు 200 నుంచి 250 మంది జ్వరపీడితులు వైద్యం కోసం వస్తున్నారు. జిల్లా వైద్యాధికారులు స్పందించి గార్ల సీహెచ్‌సీకి డిప్యుటేషన్‌పై కొత్త డాక్టర్లను పంపించి మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



మరిపెడ రూరల్: మండల అభివృద్ధికి కృషి చేయడంతోపాటు ఇక్కడి ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తానని జెడ్పీటీసీ సభ్యురాలు తేజావత్ శారద అన్నారు. శుక్రవారం మండలంలోని తానం చర్ల శివారు పాలేరు వాగు ఒడ్డున ఉన్న ప్రముఖ దేవాలయం గంగమ్మ ఆలయ ఆవరణంలో భక్తుల సౌకర్యార్థం జెడ్పీ నిధుల నుంచి రూ.3లక్షలు వెచ్చించి సోలార్ దీపాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌నాయక్, ముఖేష్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ బ్రిడ్జిపై బీరుసీసాలు..!



గార్ల: గార్ల రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగి బీరు సీసాలు బ్రిడ్జిపై వదిలి వెళ్లారు. ఈ సన్నివేశాన్ని శుక్రవారం సాక్షి క్లిక్ మనిపించింది. రైల్వేస్టేషన్‌లో మద్యం తాగుతున్న వారిపై చర్య తీసుకోవాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తొర్రూరు: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ తొర్రూరు స్టడీసెంటర్‌లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బి.రాములు తెలిపారు. వివరాలకు 73829 29787, 99086 95130 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



నెహ్రూసెంటర్: నిల్వ నీటిలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న వైద్య సిబ్బంది



కురవి: కొత్తూరు(సీ)లో నీటి సంపులో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది



దంతాలపల్లి: బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

నెహ్రూసెంటర్: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్ సూచించారు. జిల్లా కేంద్రంలోని హస్తినాపురం సబ్ సెంటర్ యూపీహెచ్‌సీలో శుక్రవారం 'ఫ్రైడే డ్రై డే' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాలని, రోడ్లపై, డ్రెయినేజీలు, ఖాళీ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ దీపిక, ఏఎన్‌ఎం ఉషారాణి, వాణి, ఆశవర్కర్ ఉపేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కురవి: తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని కొత్తూరు(సీ)పంచాయతీ కార్యదర్శి అశోక్ సూచించారు. శుక్రవారం సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలో ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఇంటింటికి తిరిగి అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జ్యోతి, ఆశకార్యకర్త శైలజ, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి పాల్గొన్నారు.

దంతాలపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రతీ ఒక్కరు శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండలంలోని రేపోణి గ్రామ పంచాయతీలో శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్ వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దోమలను నివారించడం ద్వారా సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ అప్సర్‌పాషా, కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

'సుప్రీం' తీర్పుతో మాదిగలకు న్యాయం



డోర్నకల్: మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కురవి: సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగలతోపాటు ఉపకులాలకు న్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఉద్యమంలో పనిచేసిన అప్పటి నాయకులు దైద భద్రయ్య, కిన్నెర మల్లయ్యలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐలయ్య, ఉపేందర్, ఉప్పలయ్య, లక్ష్మయ్య, సత్యం, నాగరాజు పాల్గొన్నారు.

డోర్నకల్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పును హర్షిస్తూ శుక్రవారం డోర్నకల్‌లో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, వీరస్వామి, రమణ, విలియం, బాబు పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండలంలోని విస్సంపల్లి గ్రామంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కంచనపల్లి ప్రశాంత్, నాయకులు నర్సయ్య, శ్రీను, వెంకన్న, రాములు పాల్గొన్నారు.

కొత్తగూడ: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు యాకయ్య, ప్రేమ్‌సాగర్, శంకర్, సమ్మయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

హర్షణీయం

మహబూబాబాద్ అర్బన్: షెడ్యూల్ కులాల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని మాదిగ ఉపకులాల జర్నలిస్టు సంఘం జిల్లా కన్వీనర్ కట్కూరి ప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాస్, యాదగిరి, రాజు, సుధీర్ పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నర్సింహులపేట: గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని పెద్దనాగారం, నర్సింహులపేట గ్రామాల్లో నిర్వహించిన సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరణ చేసిన అనంతరం మాట్లాడారు. అర్హులైన గీత కార్మికులకు ద్విచక్రవాహనాలు, ఇళ్లు, ప్రమాదాలు జరగకుండా సేఫ్టీ మోకులు ఇవ్వాలన్నారు. సర్వాయి పాపన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. అనంతరం వెంకటేశ్వర్లును సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న, సొసైటీ అధ్యక్షుడు గాడిపల్లి రవిగౌడ్, రాష్ట్ర నాయకులు గునిగంటి మోహన్, జిల్లా నాయకులు లింగయ్య, రామన్న, ప్రభాకర్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం

తొర్రూరు రూరల్: మండలంలోని వెలికట్ట గ్రామంలో బాల వికాస సంస్థ వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ రమా, కార్యదర్శి ప్రభు, కారోబార్ రమేష్ చంద్ర, వైద్యులు కుతుజా, ప్రసన్న, సంతోష్, పాషా, రాకేశ్ పాల్గొన్నారు.

డోర్నకల్: మున్సిపాలిటీ పరిధిలోని రాజుతండాలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు శివ, సీహెచ్‌ఓ వీరబాబు, సూపర్‌వైజర్ వెంకన్న, ఏఎన్‌ఎం హరిత పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలి



గార్ల: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

గార్ల: పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంపూర్ణ సూచించారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం గార్ల పురవీధుల్లో అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరిత, కృష్ణకుమారి, సుజాత, పద్మ, రోజా, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై ఐసీడీఎస్ పరిధిలోని కేంద్రాల టీచర్లు ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ బ్లాక్ కోఆర్డినేటర్ చైతన్య, సూపర్‌వైజర్ జ్యోతి పాల్గొన్నారు.

డోర్నకల్: మండలంలోని బాపూజీనగర్, ఇందిరానగర్, బంకట్‌సింగ్‌తండా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కె.శ్రీదేవి, ఏఎన్‌ఎం జ్యోతి, కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

తొర్రూరు: తల్లి పాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని వర్ధన్నపేట సీడీపీఓ డెబోరా అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



కేసముద్రం: వివేకవర్ధిని స్కూల్‌లో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లోని వివేకవర్ధిని హైస్కూల్‌లో జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు వెంకయ్య చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతంగౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ చిర్ర నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: పింగళి వెంకయ్య విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని నేతాజీ సేవా సమితి అధ్యక్షుడు కందుల నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో వెంకయ్య చిత్రపటం వద్ద శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో వివేక్, గంగాధర్, ప్రవీణ్, సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కేసముద్రం: తపాలా శాఖ ద్వారా అందించే పలురకాల స్కీంలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట సబ్‌డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సుచేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాట్రపల్లి గ్రామంలో నిర్వహించిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. తక్కువ మొత్తంలో రూ.520 ప్రీమియం చెల్లించి రూ.10లక్షలు, రూ.749ల ప్రీమియం చెల్లించి రూ.15లక్షల వరకు జీవిత బీమా పొందవచ్చన్నారు. 18నుంచి 65 సంవత్సరాల వరకు ఉన్న ప్రతీ ఒక్కరు జీవిత బీమా తీసుకునేందుకు అర్హులని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామ పోస్ట్ మాస్టర్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ గుగులోతు దస్రూనాయక్, హెచ్‌ఎం వీరభద్రయ్య, జీపీ కార్యదర్శి ప్రవీణ్, యాకాంబ్రం పాల్గొన్నారు.

పేదలకు పనిచేసే చోటే పింఛన్ ఇవ్వాలి

కేసముద్రం: కుటుంబ జీవనం కోసం దూరప్రాంతాలకు పనులపై వెళ్లే నిరుపేదలైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ప్రభుత్వం అందించే పెన్షన్‌ను అక్కడే ఇవ్వాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కోకన్వీనర్ పోలెపాక శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పింఛన్ ఇచ్చే క్రమంలో కార్యదర్శుల వేలిముద్రలతో ఇస్తున్నారని, ప్రస్తుతం కార్యదర్శులు బదిలీపై వెళ్లడం వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కొంత మంది కాళ్లు, చేతులు సహకరించక ఇంటి వద్దనే ఉండే వారికి ఇంటికి వెళ్లి పింఛన్ ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు కొనగొండ వెంకన్న, రాంపల్లి వెంకన్న, వీరునాయక్, రూప్‌సింగ్, రాములు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



మాట్లాడుతున్న మహేష్‌కుమార్

గార్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి మండల కార్యదర్శి ఎం.మహేష్‌కుమార్ మాట్లాడుతూ.. కళాశాలకు సుదూర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు మధ్యాహ్న భోజనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా కళాశాలకు ప్రహరీ, టాయిలెట్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు తాగునీటి కోసం ఆర్‌ఓ ప్లాంటు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు వసతిగృహం ఏర్పాటు చేయాలని కోరారు. ధర్నాలో సాయి, వాసు, హుస్సేన్, ఉష, శివాని, రక్షిత, సంజన పాల్గొన్నారు.

'దివ్యాంగురాలిపై సోదరుడి దౌర్జన్యం'



పట్టా పాస్ జిరాక్స్ కాపీని చూపిస్తున్న బాధితురాలు

మరిపెడ రూరల్: ఓ దివ్యాంగురాలికి చెందిన వ్యవసాయ భూమిని ఆమె సొంత సోదరుడే దౌర్జన్యంగా సాగు చేసుకుంటున్నాడు. బాధిత దివ్యాంగురాలి కథనం ప్రకారం.. మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన అవివాహిత దివ్యాంగురాలు బత్తెం ఎల్లమ్మ తన తండ్రి ఇచ్చిన 20గుంటల భూమితోపాటు తన సొంతంగా మరో 28 గుంటల భూమి కొనుగోలు చేసుకుంది. ఎకరం 8గుంటల భూమికి పట్టా పాస్ పుస్తకం కలిగి ఉంది. అయినప్పటికీ స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో తన సోదరుడు అయిన బెత్తం వెంకన్న దౌర్జన్యంగా భూమిని సాగు చేసుకుంటున్నాడు. ఇదేమని ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నాడు. చేసేదిలేక దివ్యాంగురాలు తొర్రూర్ జూనియర్ సివిల్ కోర్టును ఆశ్రయించింది. ఈ విషయంపై మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.

సంక్షిప్త సమాచారం

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్ రూరల్: మండలంలోని రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 5వ తేదీ చివరి గడువుగా ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. జూన్ 28వ తేదీలోపు కొత్తగా వచ్చిన పట్టాదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 59 ఏళ్లు ఉన్న రైతులు అర్హులని తెలిపారు. దరఖాస్తు ఫారాలను తమ క్లస్టర్ పరిధిలోని ఏఈఓకి అందజేయాలన్నారు.

చెరువుల పరిశీలన

దంతాలపల్లి: మండలంలోని బొడ్లాడ గ్రామంలోని చెరువులను ఎస్సారెస్పీ ఈఈ సమ్మిరెడ్డి శుక్రవారం పరిశీలించారు కార్యక్రమంలో డీఈ వినయ్‌కుమార్, ఏఈ మౌనిక పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్య తీసుకోవాలని రైతుకూలి సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ రవీంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్, పైడి, నారాయణరెడ్డి, కుమారస్వామి, సారయ్య పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ

మరిపెడ: రైతులు స్వేచ్ఛగా రుణమాఫీ పొందాలని పీఏసీఎస్ చైర్మన్ చాపల యాదగిరిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. కిందిస్థాయి ఉద్యోగుల రైతుల వద్ద నుంచి వసూళ్లకు పాల్పడిగే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు, షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ అందిస్తున్నట్లు వివరించారు.

హామీలు అమలు చేయాలి

బయ్యారం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు యాప సీతయ్య అన్నారు. బయ్యారంలో శుక్రవారం మండల కమిటీ సమావేశం సందర్భంగా ఆయన పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. సమావేశంలో మండల అధ్యక్షుడు రాసాల నరేష్‌యాదవ్, నాయకులు శ్రీను, చంద్రయ్య, చౌహాన్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి

కురవి: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.6వేల పింఛన్ ఇవ్వాలని సంఘం రాష్ట్ర నాయకుడు సయ్యద్ ఖాజా డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వీరబాబుకు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమేష్, వెంకన్న, సీతారామయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

వంటగదులను నిర్మించాలి

కేసముద్రం: కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చెట్ల కిందనే వంటలు చేయడం ద్వారా ఇబ్బందికరంగా మారిందని, పాఠశాలల్లో వంటగదులను నిర్మించాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి సందర్భంగా ఆయన మాట్లాడారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం శుక్రవారం ఏఏపీసీ చైర్మన్ లావణ్య, హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి పరిశీలించారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి

డోర్నకల్: డోర్నకల్ ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థుల కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కోకన్వీనర్ గందసిరి జ్యోతిబసు డిమాండ్ చేశాడు. శుక్రవారం హాస్టల్‌ను సందర్శించిన ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కమిటీ సభ్యులు సందర్శించారు.

చర్య తీసుకోవాలి

మహబూబాబాద్: కలెక్టరేట్ సమీపంలో నూకల రాంచంద్రారెడ్డి విగ్రహం కోసం కేటాయించిన భూమిలో చాలా వరకు అన్యాక్రాంతం అవుతుందని, కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు: ఏజెన్సీ మండలాల్లోని ట్రైబల్ జర్నలిస్టు సమస్యలు పరిష్కరించాలని టీడబ్ల్యూజేఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామునాయక్ కోరారు. మండలంలోని మచ్చర్లలో శుక్రవారం జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్‌కు వినతిపత్రం అందించారు.

పాలాభిషేకం

తొర్రూరు రూరల్: రైతు రుణమాఫీని స్వాగతిస్తూ మండలంలోని సోమారపుకుంట తండాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిల చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, మల్లేశంగౌడ్, నాయకులు రెడ్యానాయక్, వీరన్న పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన ఉపాధ్యాయులు

డోర్నకల్: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న కృతజ్ఞత సభలో పాల్గొనేందుకు శుక్రవారం పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, కాసు మారెడ్డి, వెంకటప్పయ్య, రాములు, నిజామియా, సాహెబ్‌అలీ, సత్యనారాయణ పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ

కేసముద్రం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ ఎస్.వెంకటేశ్వర్‌రావు పుట్టినరోజు సందర్భంగా పలువురికి పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నంబికిషోర్, క్లబ్ కోశాధికారి సత్యనారాయణ, శ్రీరాములు, ప్రేమ్‌కుమార్, కరుణాకర్ పాల్గొన్నారు.

సమన్యాయం చేయాలి

గార్ల: మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులందరిని ఎమ్మెల్యే కోరం కనకయ్య కలుపుకొని పోతూ సమన్యాయం చేయాలని పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్ కోరారు. శుక్రవారం స్థానిక ఏవీఆర్ ఫంక్షన్ హాలులో సీనియర్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకట్రామయ్య, వెంకట్‌రెడ్డి, సాంబశివరావు, రామకృష్ణ, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నాట్లు వేసి నిరసన

నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో బురదమయమైన రోడ్లపై శుక్రవారం నాట్లు వేసి నిరసన తెలిపారు. బురదమయమైన రహదారులకు మరమ్మతులు చేపట్టి, వ్యాధులు రాకుండా చర్య తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పోరాటానికి సిద్ధం కావాలి

నెల్లికుదురు: వర్గీకరణ తీర్పు ఆర్టికల్ 14కు సమానత్వం కోసం జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో న్యాయ పోరాటానికి సిద్ధం కావాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్ మాలలకు సూచించారు. ఈమేరకు ఈ నెల 7, 8, 9న ఢిల్లీలో జరిగే సామాజిక చైతన్య దీక్షలకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరుతూ శుక్రవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు యాకాంతం, రాంబాబు, సంజీవ, శ్రీకాంత్, అనిల్, అమీస్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

విద్యుదాఘాతంతో మహిళ మృతి



వినోద (ఫైల్)

గూడూరు: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని రాములుతండాలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నూనావత్ విజయ్‌భాస్కర్ భార్య నూనావత్ వినోద (38) వంట గదిలో కరెంటు బోర్డుకు ఉన్న ప్లగ్ తీయబోగా, ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

రిటైర్డ్ రైల్వే ఉద్యోగి..

గార్ల: దక్షిణ మధ్య రైల్వేలో సీనియర్ డీసీఎంగా పనిచేసి రిటైర్డ్ అయిన గార్లలో నివాసం వుంటున్న మూడు కృష్ణచవాన్ (71) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. బంజారా భాషకు లిపి రాయడమే కాకుండా, బంజార భాషలో భగవద్గీత రాసిన తొలి వ్యక్తి. ఆయన మృతికి పలువురు స్థానిక ప్రముఖులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో ఎద్దు..

కురవి: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని సూదనపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సూదనపల్లి గ్రామానికి చెందిన తోట విష్ణు అనే రైతుకు చెందిన ఎద్దు మేత కోసం ఊరి శివారులోకి వెళ్లింది. అక్కడ మేత మేసుకుంటూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్‌కి తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని రైతు తెలిపారు.

ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

డోర్నకల్: స్థానిక యాదవనగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు మూడు ట్రాక్టర్ల బ్యాటరీలను చోరీ చేశారు. యాదవనగర్‌కు చెందిన సకినాల వెంకన్న, కోడి యాకయ్య, బడేటి రోహిత్‌లకు చెందిన ట్రాక్టర్లను ఇళ్ల ముందు నిలపగా గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బ్యాటరీలను చోరీ చేశారు. ఒక్కో బ్యాటరీ విలువ రూ.10వేల వరకు ఉంటుందని, చోరీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు ట్రాక్టర్ల యజమానులు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

బయ్యారం: మండలంలోని కొత్తపేట గ్రామంలోని కొమురం కాలనీలో షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన దారం వీరస్వామి ఇంట్లో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ జరిగి మోటార్‌సైకిల్‌తో పాటు నిత్యావసర వస్తువులు దగ్ధమయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని వీరస్వామి కోరాడు.

పశువులతో వెళ్తున్న డీసీఎం పల్టీ..

మరిపెడ రూరల్: పశువులను అక్రమంగా తరలిస్తున్న డీసీఎం వాహనం పల్టీ కొట్టింది. ఈ ఘటనలో నాలుగు పశువులు మృతి చెందాయి. ఎస్సై సంతోష్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వయా ఖమ్మం మీదుగా వరంగల్ వైపుగా ఓ డీసీఎంలో పశువులను అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో పశువులను తరలిస్తున్న వాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పల్టీ కొట్టింది. దీంతో నాలుగు పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. మిగిలిన పశువులు చుట్టు పక్కల ప్రాంతాలకు తరలివెళ్లాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గుర్తించిన ఆరు పశువులను తొర్రూరు గోశాలకు తరలించారు. సుమారు 30కి పైగా పశువులు ఉన్నట్లు, మిగిలిన పశువుల కోసం వెతుకుతున్నట్లు పేర్కొన్నారు. డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. దీంతో విద్యుత్ స్తంభం విరగడంపై ఎల్లంపేట ట్రాన్స్‌కో ఏఈ అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో నల్లాని స్వప్న తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ కనుగొని ఆమె భర్త నల్లాని నవీన్ రావుకు అప్పగించామని రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి శుక్రవారం తెలిపారు.

గార్లలో..

గార్ల: గత సంవత్సరం గార్లకు చెందిన ఐల వాసు సెల్‌ఫోన్ చోరీకి గురైంది. దీంతో అదే రోజు బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు కామేపల్లి మండలం తాళ్లగూడెం గ్రామానికి చెందిన షఫీ వద్ద ఉన్నట్లు గుర్తించారు. బాధితుడు వాసుకు శుక్రవారం ఎస్సై జీనత్‌కుమార్ అందజేశాడు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



తొర్రూరు రూరల్: వ్యవసాయ మోటార్లకు వినియోగిస్తున్న విద్యుత్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ డీఈ మధుసూదన్ సూచించారు. శుక్రవారం మండలంలోని అరిపిరాల గ్రామంలో విద్యుత్‌శాఖ వారి ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈ మాట్లాడుతూ.. వర్షాకాల సీజన్‌లో పంటల సాగు చేస్తున్నప్పుడు బావుల మోటార్లను వినియోగించే క్రమంలో చుట్టు సాగునీరు ఉండడం ద్వారా విద్యుత్ సరఫరా అవతుందన్నారు. ఆ సమయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యుత్ అధికారి చలపతిరావు, యాకన్న, సిబ్బంది పాల్గొన్నారు.